## వారఫలం

స్తాయి. వారం ఆఖరులో అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు—పుణ్యకార్యాలు చేస్తారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**తుల :—** వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగించగలదు. విద్యా వైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

**వృశ్చికం :—** మీ ఆలోచనలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు హడావుడిగా వుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

**ధనుస్సు :—** మీ కార్యక్రమాలు బాగుంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు: ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

**మకరం :—** మీరు శ్రమపడినా, ఫలితం దక్కదు. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి, మీ ఆలోచనలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందగలదు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.


**కుంభం :—** వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో వ్యతిరేకమైన వార్తలను వింటారు. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. వారం ఆఖరులో మీ కార్యక్రమాల్లో అనుకూలత లభిస్తుంది. స్త్రీలకు-ఆరోగ్యం బాగుండదు. విలాస వస్తువులు కొంటారు.

**మీనం :—** మీ కంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసివస్తుంది. పుణ్యకార్యాలుచేస్తారు. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. సాహిత్య కళా రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వారం ఆఖరులో వ్యతిరేక పరిస్థితి ఏర్పడగలదు. స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరతాయి. ప్రయాణాల్లో శ్రమకలుగుతుంది.

— మహేష్

# తీరని ఋణం

భాగవతుల లలితశర్మ



చల్లగాలికి అప్పుడే కునుకు పట్టిందేమో, బస్సు అనకాపల్లి చేరడం గమనించలేదు. బస్ స్టాండులో కోలాహలానికి త్రుళ్లిపడి లేచేను.

వెంటనే నా కళ్లు అప్రయత్నంగా నాలుగు వేపులా పరికించడం మొదలు పెట్టేయి. సీటులోంచి కదలకుండానే మెడలు నొప్పిపుట్టే దాకా బయటికి చూస్తూ కూర్చున్నాను.

బస్సు ఆగీ ఆగకుండానే హాజరయే కోవా బిళ్లల అబ్బాయి, సోడాలవాడు, చామంతి పూల అమ్మాయి, కర్ర స్టాండుకి తగిలించుకుని రిబ్బన్లు, పిన్నులు, సూదులు అమ్మకొనే అమ్మాయి, బెల్లం దిమ్మల తోపుడు బండీ...

అబ్బ! ఎంత చూసినా వీళ్లే. ఇవాళ కూడా కనిపించడేమిటి చెప్మా, 'వాడు'?

_ పోనీ దిగివెళ్లి అలా చూసొస్తేనో అనిపించింది. పనిలో పని, కాస్త కాఫీ తాగివస్తే ఈ నిద్దరమత్తు కూడా వదులుతుంది.

కాళ్లు కాఫీ హోటల్లోకి దారి తీస్తున్నా దృష్టి మాత్రం బస్సు పరిసరాల్ని వదలడం లేదు. యీ అమూల్యమైన క్షణాల్ని వేస్టు చెయ్యడం నా కేమాత్రం ఇష్టంలేదు.

త్వరగా కాఫీ తాగి బయట పడ్డాను. 'వాడు' గాని ఈలోగా వచ్చి వెళ్లిపోలేదు కద! కంగారుగా బస్సెక్కి, కిటికీపక్క సీటులో చతికిలబడ్డాను. టయిమయి నట్టుంది. బస్సులోకి ఒక్కొక్కరే చేరుతున్నారు.

_ 'కాళ్లు లేవు బాబూ, ఒక పైసా ...'

ముష్టివాడి మాట పూర్తవకుండానే కస్సున తిరగబడుతున్నాడు వెనక సీట్లో పెద్ద మనిషి 'వెళ్లు వెళ్లు, తేరగావస్తున్నాయి పైసలు...' వెంటనే చివాల్న వెనక్కి తిరిగి చూసేను. ప్చ్! 'వాడు' కాదు. అయ్యో! బస్సు కదిలిపోతోంది. ఆఖరిసారి బయటికి చూసేను ఆశని కూడగట్టుకుంటూ – ప్చ్! ఈ సారికి మరింతే!

విశాఖపట్నంలో చదువు వెలగబెడ్తున్న నాకు వారం కొకసారి యలమంచిలి వెళ్లి అమ్మ చేతి కమ్మటి భోజనం, నాన్నగారి చేత సన్న సన్నటి చీవాట్లు (బాగా చదువుకోమని) తినందే తోచదు ఆవేళ కూడా ఇలాగే యలమంచిలి బయలుదేరేను. కిటికీ దగ్గర సీట్లో కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటున్నాను. బస్సు అనకాపల్లి వదలడానికి సిద్ధంగా వుంది.

కథ మంచి పట్టులో వుందేమో, 'బాబయ్యా ధర్మం...' అన్నమాట విని చిరాకు పడ్తూనే తలపైకెత్తి చూసేను. రెండు పదులు నిండే వుంటాయి వాడికి. దీనత్వం నింపుకున్న వాడి కళ్లు ఈ జన్మలో మర్చిపోలేను. బ్రతుకుమీద నైరాశ్యం అంతా వాడి చూపుల్లోనే వుందేమో అనిపిస్తుంది. దేశంలో దర్రిద్రానికి ప్రతినిధిలా వున్నవాడి మురికోడుతున్న చొక్కాలో చిరగని భాగం అంటూ లేదు. తొడుకున్న నిక్కరు వాడి సైజుది కాదు. తైలసంస్కారం ఎరగని, దుబ్బులాంటి ఉంగరాల జుత్తు, చాపిన కుడి చేతికి ఆరువేళ్లు...ముందుకి వంగి చూస్తే తెలిసింది, వాడికి ఒక కాలు కూడా లేనట్టు. బాగా చూస్తే, ఎప్పుడో ఎక్కడో చూసిన పోలికలు కనబడుతున్నాయి వాడి ముఖంలో. జ్ఞాపకం తెచ్చుకుందికి ప్రయత్నిస్తూనే జేబులో చెయ్యి పెట్టేను. అరె! చిల్లరలేదే! ఉన్న వినాలుగూ రూపాయి నోట్లే. ఏం చెయ్యడం? పోనీ ఓ రూపాయి పడేస్తే? అబ్బే! అందుకుమాత్రం మనసొప్పలేదు. బినా ముష్టివాడికి రూపాయి ఇచ్చేసేంత మంచి పరిస్థితిలో వుందా నేటిదేశ్రపజ! ఛ! ఒక పది పైసలు బిళ్లలేకుండా పోయింది జేబులో. మనసురాయిచేసుకొని 'చిల్లరలేదోయ్' అన్నాను, వాడి మొహంలోకి చూసే శక్తి లేక ఎటో చూస్తూ. నా మాట వినిపించినట్టు లేదు. పాపం, అలాగే ఆశగా చూస్తూ నిలబడ్డాడు. ఆ చూపుల్తోనే నా మొహంలో ఏదో వెతుకుతున్నాడు పరీక్షగా. ఆ గుండ్రటికళ్లు నాకు బాగా పరిచయమున్నట్లే అనిపిస్తున్నాయి. ఎక్కడో చూసివుంటాను. వాడినే అడిగితేసరి! ఊహూ...అందుకు మాత్రం నా సంస్కారం ఒప్పకోలేదు. నా ఆలోచనలో నేను వుంటూండగానే బస్సు మెల్లిగా కదిలిపోయింది. తల పైకిపెట్టి వెనక్కి చూసేను. వాడు ఇంకా నన్నే చూస్తున్నాడు.

ఇంటికిచేరి, రాత్రి పడుకున్నా వాడి జాలిగొలిపే కళ్లు మాత్రం నన్ను వదల్లేదు. పొరపాటయి పోయింది... వాడికి ఆ రూపాయి నోటు పడేసినా బాగుండిపోను మనసంతా చిగాకయి పోయింది. ఇప్పుడు బాధపడి ఏం లాభం. పోన్లే, యీసారి కనబడుతాడుగా అప్పుడు ఇచ్చియొచ్చు! ఇంతకూ వీడు–ఆ కళ్లు, ఉంగరాల జుత్తు, కుడిచేతికి ఆరు వేళ్లు...ఆలోచనలు పది సంవత్సరాలు వెనక్కి పరుగెత్తేయి. అబ్బ! ఇప్పటికి జ్ఞాపకం వస్తోంది నెమ్మదిగా.

అప్పుడు నేను నాల్గవ క్లాసు చదువుతున్నరోజులు. మా స్కూలు గేటుదగ్గర వీడు బఠాణీలు, జంతికలు అవీ అమ్ముకుంటూ వుండేవాడు. వాడి పేరేమిటో తెలీదు నాకు. మహా అయితే నాకన్న ఒకసంవత్సరం పెద్దయి వుండొచ్చు. చాల హుషారుగా, చలాకీగా వుండేవాడు. కొన్నా, కొనకపోయినా రోజూ వీడి చుట్టూ చేరి వాడిచేతి ఆరువేళ్లు చూసి వెక్కిరిస్తూ, నవ్వుకుంటూ వుండేవాళ్లం మేమంతా. పాపం–వాడు అదేమీ పట్టించుకునేవాడు కాదు.

ఒకసారి ఏం జరిగిందంటే, స్కూలు పిల్లలందర్నీ 'సింహాచలం' ఎక్సర్షన్ తీసికెళ్తామన్నారు మా హెడ్ మాష్టరుగారు. ఇంట్లో ఏడ్చి, గోలపెట్టి సంపాదించుకున్న నాలుగు రూపాయలు అతి జాగ్రత్తగా గుప్పెట్లో దాచుకొని స్కూలికి పరుగెత్తాను.

మాష్టారికి డబ్బు కట్టడానికి ఆఖరు తేదీ ఆ రోజే! తీరా క్లాసులోకి వెళ్లి చూసుకుంటే రెండు రూపాయలే వున్నాయి. అరె! మిగతా రెండు నోట్లూ ఏమయినట్టూ! చాల గట్టిగా పట్టుకున్నానే. అయినా ఎక్కడో రాలిపోయాయి దార్లో. సరదాగా అందరితో కలసి సింహాచలం వెళ్లడం దేముడెరుగు! ఈ సంగతి తెలుస్తే నాన్న వీపు చీరెయ్యడూ! ఇప్పుడేంచెయ్యాలి! తల్చుకున్న కొద్దీ నాకు దుఃఖం ఆగడంలేదు. ఏడుపు లోపలే మింగుకుంటూ గేటుదాటి బయటపడ్డాను. దారంతా వెతుక్కుంటూ పోతేమటుకు ఎక్కడ దొరుకుతాయి? ఈ పాటికి అవి ఎవరో అదృష్టవంతుల జేబులో చేరిపోయి వుంటాయి. పది గజాల దూరంవెళ్లి నిరాశగా వెనక్కి తిరిగి వచ్చేసేను. ఆలస్యంఐతే మాష్టారూ కొడతారేమో! డబ్బులు దొరకలేదు! ఏంచెయ్యాలో తోచక భోరుమని ఏడవాలనిపించింది. ఎవరేనా చూస్తే బాగుండదు! చుట్టూ చూసేను తలెత్తి. బఠాణీలబ్బాయి నన్నేచూస్తున్నాడు. బలవంతంగా ఏడుపు ఆపుకున్నాను. నా అవస్థ చూసి వాడికి జాలేసిందేమో 'ఏటయింది బాబూ!' అన్నాడు దగ్గరగావచ్చి. వాడు అలా జాలిగా అడిగేసరికి అంతవరకు కష్టపడి ఆపుకున్న దుఃఖం అంతా కట్టలు తెంచుకుంది. "డబ్బులు పోయేయి, మా నాన్న కొడ్తారు" అంటూ బావురు మన్నాను. 'ఎంత పోయినాయేటి? అన్నాడు వాడు మళ్లీ. 'రెండు రూపాయలు. కొత్తనోట్లు అన్నాను, వాడి చేతివేపే చూస్తూ. వాడు బఠాణీల సజ్జలో అడుగున గుడ్డ క్రింద కాసేపు ఏదో వెతికాడు. నాలో చిన్న ఆశలాంటిది మొలకెత్తింది. వాడు నోట్లుపైకితీసి, 'ఇవేనేటి? నాకు ఇందాక గేటుకాడ దొరికేయి' అన్నాడు. నావే అవి! సరికొత్త నోట్లు. వీడికి దొరికినట్టున్నాయి. ఇది కలా,నిజమా అనిపించింది. కలకాదు నిజమే అని చెప్తున్నాయి వాడి చేతి ఆరువేళ్లమధ్య రెపరెపలాడుతున్న

### పిచ్చెక్కిన విమానం!

డిసెంబరు 2వ తేదీన అమెరికాలో కొలంబస్‌లోని విమానాశ్రయంలో ఓ చిన్న విమానంవచ్చి ఆగింది. పైలెట్ విమానం ఇంజను పనిచేస్తుండగానే కిందికి దిగాట్ట. ఇంతలో ఉన్నట్టుండి ఇంజన్‌లోని ఓ వాల్వు దానంతటదే కదిలి విమానం పరిగెత్తడం ప్రారంభించింది. పరిగెత్తి ఓ 25 గజాలు గాలిలో ఎగిరి తిరిగి కిందకు దిగిందట. విమానం వెనకాలే పరుగెత్తుతున్న పైలెట్ ఎట్టకేలకు దానిరెక్క ఒకటి పుచ్చుకుని వేలాడగలిగాడు. విమానాశ్రయమంతా గజిబిజిగా తిరిగి తిరిగి, ముప్పతిప్పలు పెట్టి చివరకి ఒక స్తంభానికి గుద్దుకుని ఆగిపోయిందట.

కొత్త వోట్లు ... 'ఎంతమంచి వాడు! దొరికేయికదాని దాచేసుకో కుండా ఇంత న్యాయంగా ఎవరు ఇచ్చేస్తారు. వీడు కాబట్టే ఇస్తున్నాడు. ఇంకెప్పుడు వాడి వేళ

## తీరని ఋణం

చూసి వెక్కిరించ కూడదు' అనుకున్నాను. ఆ పరిస్థితిలో వాడు నాకుచేసినమేలు ఎలా మర్చి

పోగలను? వాడి నిజాయితీనిమాటల్లో వ్యక్తం చెయ్యకలిగే వయస్సుకాదది. వాడిమంచితనాన్ని మెచ్చుకొని వాడిని సంతోష పెట్టాలన్నజ్ఞానం లేదప్పుడు, 'మరి నా కేటిస్తావు?' అని అడిగేదు


# శ్రమ జీవుల బట్టలకు




# శ్రమ పడి పని చేసే

డిటర్జంట్ బిళ్ళ

# సోలార్

సోలార్ డిటర్జంట్ బిళ్ళ అద్భుతమైన SC3 కలది—ఎంత పాదుకునిపోయిన మురికినైనా పారద్రోలుతుంది. కాలర్లు, కఫ్‌ల మీద అంటుకుని విడకుండా వున్న మురికి పటాపంచలైపోతుంది.

మురికిని ఉతికి వెయ్యండి. అత్యంత శక్తిగల సోలార్‌తో ఉతకండి. మీ డబ్బుకు అమూల్యమైన విలువ పొందండి.

**సోలార్ ఏమాత్రం వదలని మురికిని వదిలిస్తుంది**

హిందుస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

లింటాస్-SOLAR.3-140 TI

వాడు నవ్వుతూ, నా చేతిలో రూపాయలుంచి. 'ఇప్పుడు నా దగ్గర ఇవే వున్నాయే? మరెలాగ ...పోనీ నేను పెద్దయాక నాన్నగారిలాగే నా దగ్గర బోలెడు డబ్బులుంటాయిగా! అప్పుడు ...అప్పుడు నీకు తప్పకుండా ఇస్తాను'అంటూ స్కూల్లోకి పరుగెత్తేను. వాడిమీద కృతజ్ఞతా భావం మనసులో ఓ మూల మెదుల్తూన్నా, వాడు మళ్లీ ఎప్పుడేమిటడుగుతాడో అని చాల రోజులు వాణ్ణి తప్పుకు తిరిగేవాడిని. కాని ఆసంగతి వాడు అప్పుడే మర్చిపోయివుంటాడు. మళ్లీ ఇన్నాళ్లకి ఇవాళ కనిపించేడు. పదేళ్ల క్రిందట ఒకనాడు నాకు నాన్నచేత దెబ్బలు తప్పించిన ఆ ఆరువేళ్ల చేత్తోనే ఈనాడు బస్సుస్టాండులో 'అమ్మా, బాబూ...'అంటూ అందరితో పాటూ నన్నూ యాచించడం... ఇంక ఆలోచించలేకపోయాను.

పాపం, బతాణీలు, జంతికలు అమ్ముకుంటూ వుంటే బాగానే వుందిగాని, ప్రపంచంలోని అనేకమంది ముష్టివాళ్లలో వీడూ ఒకడయి, అందరిచేత తిట్లు తింటూ... పైగా ఆ కాళ్లు కూడా ఎలా పోయిందో, ఈసారి కనబడితే తప్పకుండా అడగాలి. ఆ వేళ సంఘటన వాడకి జ్ఞాపకముందో లేదో! మళ్లీకనబడినప్పుడు అదీ అడగాలి. ఓ విధమైన తృప్తి మనసులో నిండగా నిద్రపోయేను.

అప్పటినుండి బస్సు ఆగినప్పుడల్లా ఆ జాగాలో చూస్తూనే వున్నాను. అలా చూడ్డం ఒక అలవాటుగా మారిపోయింది. ఎలాగేనా వాడిని ఒక్కసారి కలుసుకోవాలన్న పట్టుదల నాలో పెరుగుతూన్నకొద్దీ వాడు కనిపించక పోడం మరీ విచిత్రంగా వుంది. ఐనా నేను వారానికొకసారి వెతుకుతూ వుంటే వాడేం కనిపిస్తాడు. నేనిలా ఎదురు చూస్తున్నానని కల గాదుకద! వాడు ఎప్పటికేనా కనిపిస్తాడనే అనిపిస్తోంది నా కెందుకో!


పరీక్షలయిపోయేయి. నా అన్వేషణకి కూడ తాత్కాలికంగా అంతరాయం కలిగింది. శలవులన్నీ సరదాగా గడిచిపోయేయి. పరీక్షాఫలితాలు తెలిసినరోజు సంతోషంతోపాటు చిన్న నిరాశ లాంటిది కూడా చోటుచేసుకుందినామనసులో. ఇంక ఉద్యోగాల వేటలో పడాలి. ఎవరి కెక్కడ నీళ్లు ప్రాప్తమో. ఇక 'వాడిని' చూడ్డం పడదేమో - వాడి ఎండిపోతోంది అనుకున్న నా ఆశాలతకి కొత్త చిగుర్లు వేశాయి, నాన్నగారు తెచ్చిన శుభవార్త. నాకు అనకాపల్లిలోనే వుద్యోగం అవబోతోంది. నాన్నగారి స్నేహితుడి ఆఫీసులోనే ఏదో టెంపరరీ వేకెన్సీ వుందిట. నా కోరిక తీరడానికి యీ చిన్న అవకాశం చాలు. 'నా ముఖంలో వెలుగుతున్న సంతోషానికి కారణం ఉద్యోగమే కాదర్రోయ్, ఇంకోటి కూడా వుంది' అని గట్టిగా అరిచి చెప్పాలనిపించింది అందరికీ. కానీ ఇలాంటి విషయాలు ఎంత మంది కర్థమవుతాయి? పైగా పిచ్చివాడి కింద జమ కట్టే ప్రమాదం కూడా వుంది. అందుకని ఆ ప్రయత్నం విరమించుకొని నా సంతోషాన్ని నా గుండెల్లోనే దాచుకున్నాను రహస్యంగా.

నా అనకాపల్లి ప్రయాణానికింక అట్టే వ్యవధిలేదు.అమ్మా, చెల్లాయి కలసి సామాన్లు సర్ది ఇవ్వడంలో మహా యిద్దైపోతున్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరబోయే మొగపిల్లడూ, కొత్తగా కాపురాని కెళ్లబోతూన్న ఆడపిల్ల ఒకటేనట. ఎవరికి తోచినవి వాళ్లు బోధిస్తున్నారు.

కష్టపడి పనిచేస్తే, యీ వుద్యోగం పెర్మనెంటు అయే అవకాశాలు కూడా వున్నాయట. నాన్నగారు 'ఉద్యోగం–దాని బాధ్యతలు' అనే టాపిక్ మీద అంచె లంచెలుగా ఉపన్యాసమిస్తున్నారు. ఆయన చెప్పే ప్రతిమాటకు భక్తిగా తల వూపుతున్నా కాని నా మనసు దూరంగా ఎక్కడో ఊహాలోకాల్లో తేలుతోంది. యీ సారి 'వాడు' కనబడితే, 'అమ్మా, బాబూ' అంటూ ముష్టెత్తుకోనియ్యకూడదింక. వాడిని ఇంట్లో పెట్టుకుంటే ఆ మాత్రం చిన్న చిన్న పనే నేనా సాయం చేస్తాడు. అమ్మకి కూడా లాంటి వాళ్లని చూస్తే చాల జాలి. అందుకని తప్పకుండా ఒప్పుకుంటుంది. వాడి దిక్కరకాలు ఐతే మాత్రమేం! మనసు మంచిది. చాలమంది కన్నా చాల ఉన్నతమైన మనసుంది వాడికి. చిన్నప్పుడు వాడి మంచితనం మూలంగా తను పొందిన ఆ మధురమైన క్షణాలు ఏ దుకాణంలోనూ, ఎంత ఖరీదుపెట్టీ కొనలేనివి తను వాడికి ఒక దారంటూ చూపించగలిగితే, అప్పుడు... వాడి కళ్లలో ముందున్న నైరాశ్యమంతా కరిగిపోయి ఆ స్థానంలో భవిష్యత్తుమీది బంగారు కలల నీడలు కదులుతూవుంటే, వాడి చురుకైన చూపుల్లో ఆనందం మెరుస్తూ వుంటే... అప్పుడే, తన మనసుకి తృప్తి. అప్పటికిగాని తాను ఋణ విముక్తుడు కాడు. నా యీ ఆలోచనల తీరు ఎవరికేనా చెప్తే వింతగా, వెఱ్ఱిగా అనిపించవచ్చు. కాని నాకుమాత్రం చాల న్యాయంగానూ, సబబుగానూ అనిపిస్తోంది. ఎవరి వెర్రి వాళ్ళకానందం మన ఆనందం మరొకళ్ళకి వెర్రి అనిపించవచ్చు.

'ఇంకా ఏమిటాలోచిస్తున్నావురా? బయలుదేరు. మళ్లీ దుర్ముహూర్తం వచ్చేస్తుంది. ఇంకో అరగంటలో!' అమ్మ కేకలతో ఈలోకంలా కొచ్చి పడ్డాను.

"యీపాటికి బామ్మ వస్తూ వుండాలి కదమ్మా–ఆవిడని రానీ!" మాకు చిన్నప్పటి నుంచీ అమ్మకంటే బామ్మదగ్గరే ఎక్కువ చనువు. ఆవిడ మూడురోజుల క్రితమే పొలం వ్యవహారాలు చూసుకుందుకి స్వగ్రామం వెళ్లింది. ఇవాళ ఎలాగేనా రావలి! మొట్ట



# డాక్టరు సలహాలు

## డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

**టి. వి. — సంతనూతలపాడు**

నా భార్యకు 4 మాసముల క్రితం మెన్సస్ బ్లీడింగు అధికముగా అవుతూ చాలా రోజులవరకూ ఎక్కువగా వుండేది. మరల ఇప్పుడు 15 రోజుల నుండి వోవర్ బ్లీడింగు అవుతున్నది. దీనివల్ల ఆవిడకు ఏమైనా ప్రమాదమా ? మా వివాహము అయి 1 సం. కూడా అవలేదు. ఇలా వున్నచో సంతానం కలిగే అవకాశము వున్నదా?

ఇలా ఋతు క్రమం ఎక్కువగా అవటాన్ని "మెనొరేజియం" అంటారు. దీనికి కారణాలు చాలా ఉన్నాయి. వీటిని లేడీ డాక్టర్లు పరీక్ష చేసితీర్మానిస్తారు. అలా పరీక్ష చేసి కారణం కనుగొని తగిన చికిత్స చేస్తే— తప్పక పిల్లలు కలిగే అవకాశం ఉంటుంది. (మిగిలినవన్నీ సరిగా ఉంటే)

**డి. ఎస్. ఎస్. — నాగ్‌పూర్**

నాకు 8 సం. లుగా 'హైపర్ అసిడిటీ'ఉన్నది. కడుపులో వాయువు, తల తిరగటం, గుండెలలో మంటగా ఉంటున్నది. మాత్రలు వాడితే కొద్దిగా తగ్గుతుంది. భోజనం చేసిన 2 గం. కు మొదలవుతుంది. ఆహారం విషయంలో ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి? ఏ మాత్రలు వాడాలి?

'డుయోడినల్ అల్సర్' అనే ఈ రోగం పలువురిలో కనవడుతున్నది. సకాలానికి ఆహారం తీసుకోక పోవటం, ఆందోళన, ఎక్కువగా పులుపు, కారం, వాడటం— ఈ రోగం రావటానికి కొన్ని ముఖ్య కారణాలు.

భోజనమయిన తరువాత నెప్పి రావటం 'డుయోడినల్ అల్సర్' ఉందని తెలియజేస్తోంది.

పైన వ్రాసిన విషయాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారంలో కారం, పులుపు తగ్గించాలి. "ఆర్బిట్స్" మాత్రలు పూటకి 2 వంతున, రోజుకి 3 సార్లు 3 నెలలు వాడండి. మరి ఎక్కువగా ఉంటే శస్త్రచికిత్స శరణ్యం.

**బి. వి. — మహబూబ్‌నగర్**

మా బాబు వయస్సు 1సం. 6 మాసాలు.పుట్టినప్పటి నుండి టెస్టికల్సు క్రింది సంచిలో ఒకటి పైననే వున్నది. ఇంతవరకు అవి సరియైన పొజిషన్ లోకి రాలేదు. డాక్టరుకి చూపిస్తే అవి ఆపరేషన్ చేసి సరిచేయవచ్చు అన్నారు. ఇంత చిన్న వయస్సులో ఆపరేషన్ అంటే భయముగా వున్నది. వేరే ఏదైనా మార్గము తెలియచేయ ప్రార్థన.

ఇలా 'టెస్టికల్స్" (బీజములు) వాటి స్థానాలకు చేరక పోవటం, ఎంతో మందికి ఏర్పడుతుంది. శిశువు తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఇవి శిశువు కడుపులో వుంటాయి. అక్కడినుంచి క్రమంగా పుట్టబోయే ముందు బీజముల సంచిలోకి చేరతాయి ఇల్లా చేరనప్పుడు —"అన్ డిసెండెడ్ టెస్టిస్" అంటారు. 3 వ సంవత్సరంలో ఇలా ఉన్నవారికి చిన్న శస్త్ర చికిత్స ద్వారా వాటిని యథాస్థానానికి చేర్చటం ఉత్తమం.

**బి. ఎ. ఎస్. కె. — ఢిల్లీ**

నాకు 43 సం. లు నాకు ఒకసారి గుండె నెప్పి వచ్చినది. రెండు మూడు సెకండ్లలో స్పృహ తప్పినట్లు అయినను వైద్యుని ట్రీటుమెంటువల్ల టెంపరరీగా బాగయినది. గవర్నమెంటు ఆస్పటల్ లో చూపించిన వాళ్లు వారం రోజులు ట్రీటుమెంటు ఇచ్చినారు. రెస్టు తీసుకోమంటున్నారు. ఈ జబ్బుకు తగిన జాగ్రత్తలు తెల్పకోర్తాను.

ఇలా గుండె నెప్పి రావటం హృదయపు కండరములకు రక్త సరఫరా తగ్గటం వల్ల అయివుండవచ్చును. అలా ఒకసారి వచ్చినవారు, ఆహారంలో ఎక్కువ కొవ్వు పదార్థములను తీసుకోవటం తగ్గించాలి. ఆందోళన, ఎక్కువగా కష్టపడటం, మొదలయిన వాటికి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నెత్తురులోని గ్లూకోజు పరిమాణం, కొలెస్టరాల్. రక్తపుపోటు తరచూ పరీక్ష చేయించుకోవాలి.

**కె. సీత— విజయవాడ.**

మా తమ్ముడికి కొన్ని నెలలుగా 100F డిగ్రీల వరకూ జ్వరము వస్తున్నది. కొన్ని వెలల తరువాత మందులువాడగా తగ్గి తిరిగి అదే విధంగా వస్తున్నది. ఎన్నిమందులు వాడినా గుణం కనిపించటంలేదు. . . .

'మాంటో టెస్టు'— ఛాతీ ఎక్స్‌రే తీయించి చిన్న పిల్లల వైద్య నిపుణులకు చూపించండి. వారు రోగాన్ని నిర్ణయించి వైద్యం చెయ్యగలరు. మెడమీద గ్లాండ్స్ కూడా వాచి వుండటం వల్ల పైన చెప్పిన టెస్టులు అవసరం. ప్రైమరీ కాంప్లెక్స్, లేక టి. బి. గ్రంథులు ఉన్నప్పుడు ఇలా తరచూ జ్వరం రావటం, ఆకలి లేమి, శరీరం క్షీణించటం జరుగుతుంది.

---

మొదటిసారి ఉద్యోగమాయే! పెద్దావిడ ఆశీర్వాదం లేకపోతే ఎలా ?

బామ్మకోసం వీధి గుమ్మంలో నిల్చుని అసహనంగా చూస్తున్న నాకు, దూరంనుంచి బామ్మరిక్షా చూడగానే దేవుడు దిగొచ్చినట్టు అనిపించింది బామ్మతో చిన్నతమ్ముడుకూడా వెళ్లినట్టున్నాడు. పెద్ద ఘనకార్య మేదో సాధించుకొచ్చినట్టూ రిక్షా దిగేడు. నిండా పదేళ్లు లేనివాడు బామ్మకి పి. ఏ. లాగ, వెనకాలే అంటిపెట్టుకు తిరుగుతాడు. అమ్మ అడుగుతోంది ! 'ఇంత ఆలస్య మయిందేమీ, బస్సు లేటా ?'

'బామ్మా నీకోసమే ఎదురు చూస్తున్నా; మరి నేవెళ్లిరానా?'అంటూవంగి బామ్మకాళ్లకి దండం పెట్టేను. 'క్షేమంగా వెళ్లిలాభంగా తిరిగిరా నాయినా'అంటూ దీవించింది. అమ్మ అడిగిన దానికి జవాబుగా బామ్మ చెప్తున్న మాటలు గుమ్మం దిగబోతున్న నన్ను మంత్రం వేసినట్టు ఆపేశాయి. 'అనకాపల్లి బస్ స్టాండులో ఎవడో బస్సుకింద పడ్డాడు. వాడు,

## తీరని ఋణం

మరోడూ కలిసి దెబ్బలాడుకున్నారు, ఎవరో పడేసిన పదిపైసల కోసం. ఆ దెబ్బలాటలో పడి వెనక వస్తూన్న బస్సు చూసుకోలేదు—

ముష్టివాళ్లకు కూడా ఊరంతకావేషాలు. ఇంతకీ వాడికి ఇనాళతో నూకలు చెల్లిపోయి నట్టున్నాయి! బామ్మమాటలు కర్ణకఠోరంగా వినపడుతున్నాయి 'యిదుగో! యీ వెధవని మరెప్పుడూ నాతో తీసుకెళ్లను! ఆ చచ్చిన వాడి చుట్టూ జనంపోగయినారా! వీడుకూడా ఆ జనంలో జొరబడి ముందుకుపోయి నిల్చున్నాడు. వీడిని వెలికి తీసుకొచ్చేసరికి నా ప్రాణాలు పోయాయంటే నమ్ము! వెళ్లరా వెధవా! ముందు స్నానం చెయ్యి వెళ్లి' తమ్ముడిని తిడుతోంది బామ్మ!

కొన్ని క్షణాలపాటు మనసు మొద్దుబారి పోయింది. జరగకూడనిదేదో జరిగిపోయినట్టూ మనసు శంకిస్తోంది.'లేదు, అలా జరిగి వుండదు-అలా జరగడానికి వీల్లేదు—అంతా పట్టిభయమే' అంతరాత్మ సర్ది చెబుతోంది.

స్నానంచేసి తల తుడుచుకుంటూ వచ్చేడు తమ్ముడు.

'ఒరేయ్,నువ్వుచూసేవా వాడిని,అదే.బస్సు కింద పడినవాడిని! ఎలా వున్నాడు' గుండెల్ని అదుపులో పెట్టుకుంటూ వీలయినంత ముద్దుగా అడిగేను. కంగారు పెడితే సరిగా చెప్పడు.

'నేను బాగా చూసేను అన్నయ్యా! మరేం వాడికి ఓ చేతికి ఆరువేళ్లున్నాయి. ఓ కాలు కూడా లేదు. నేను బాగా దగ్గర్నుంచి చూసేను. నిజం !'

'ఐపోయింది-'వాడి'కథపూర్తయిపోయింది. వాడి ఋణం తీర్చుకో లేకపోయాను. అది తీరేదికాదు. ఎలా తీర్చగలను? నాచేతికి ఐదు వేళ్లే. వాడిచేతికో ఆరు వేళ్లున్నాయి... ఆరో వ్రేలికి ఎముక కూడా లేదేమో! ... వాడు ఎవరికీ కనిపించని లోకానికి వెళ్లి పోయేడు'...భోరున ఏడ్చింది నా మనసు!